## 4

మరునాటి ఉదయం ఉసురుమిల్లి ఊరంతా మారుమోగుతూంది, కోనలోవలో మన్నెపడుచు పెద్దపులిని అలుగులతో చంపేసిందని. జనం తండోపతండాలుగా ఆవింత చూడ్డానికి విరుచుకు పడుతున్నారు. వీరయ్య వెంకటేశుగూడా బయలుదేరారు. కోనలోవ ఉసురుమిల్లికి మూడుమైళ్ళ దూరాన ఉంది. వీరు చేరుకునేసరికి చాలామంది మెకాన్ని చుట్టుముట్టి దాన్ని చంపిన పిల్ల సాహసాన్ని కొనియాడుతున్నారు. మునసబు కరణాలు ప్రభుత్వానికి రిపోర్టు చేశారు ఈ ఘనకార్యాన్ని. మన్నెపడుచుకు బహుమతీ ఇప్పించమని శిఫారసు చేశారు. నిన్న సాయంత్రం వెంకటేశుకు కనుపించిన మన్నెదొరలు ఇద్దరు అక్కడే ఉన్నారు. ఆ పడుచుమాత్రం లేదు. పులి చచ్చిఉండీ భీకరంగా అవుపిస్తూంది. మధ్యాహ్నం పన్నెండు గంటలదాకా అక్కడే ఉండి తిరిగి ఇంటికి బయలుదేరిన వెంకటేశు మెదడులో ఒక కోరిక మెదిలింది. మంగ వ్రాసిన పులిగోరు పతకంమాట గుర్తుకొచ్చింది. "రెండుగోళ్లు కావాలి. ఇవ్వడానికి వీలవుతుందా? ఖరీదిస్తాం!" అన్నాడు మన్నెదొరలతో. వాళ్ళు "వీల్లేదు పొమ్మం"టున్నారు, ఇంతలో ఎక్కడనుండి వచ్చిందో దాన్ని చంపిన పడుచు ఊడిపడింది. వెంకటేశును తేరిపారజూసింది. అతని కోరిక గుర్తించింది. "ఇప్పుడు గాదు తర్వాత చూద్దాం" అన్నట్లు జాలంచేస్తున్నారు వాళ్లిద్దరూ. "ఇప్పుడే కావాలి రేపటెల్లుండి మేం మానాడు కెళ్ళిపోతున్నాం" అన్నాడు వెంకటేశు. ఇంతలో ఆ పడుచు చటాలున వంగి పెద్దపులి గోళ్లను వడిగా ముడిపెట్టి, పినిపెట్టి త్రుంచి రెండు వెంకటేశు చేతిలో ఉంచింది. అతడు సంతోషం ఉట్టిపడే ముఖంతో ఆమెవైపు ఒకసారి తేరిపారజూచి జేబులో చెయ్యిపెట్టాడు. "అబ్బే—డబ్బక్కర్లేదు—పట్టుకెళ్లండి!" అంటూ చిరునవ్వుతో ఆ పడుచు వెంకటేశు ఇచ్చే డబ్బు పుచ్చుకోవడానికి సమ్మతించలేదు.

ఇంటికి వచ్చిన వెంకటేశు మనసులో ఆ పిల్ల గుణాలు విచిత్రంగా మసలసాగాయి. ఏమిటీ ఈమె ఉద్దేశ్యం? ఎంత సాహసం! సాహసానికి తగ్గ ఔదార్యం ఫలోక్తిగలదే—తనలో ఏ ప్రత్యేకత ఉండి ఆమెను ఆకర్షించిందీ? లేక ఆమెతీరే అంతా? ఆ చిరునవ్వు తన్ను చిత్తుచేసేస్తుంది. తన కాక్షణాలు ఎందు కలా ఉండాలి? ఆమెకూ తనకూ సంబంధం? జీవితంలో విధి ప్రేరితములై ఎన్నో వింత సంఘటనలు కలుగుతూంటాయి గదా అనుకున్నాడు.

వీరయ్య బాలాంత్రం తిరిగి వెళ్ళడానికి ప్రయాణసన్నాహం చేశాడు. షష్ఠికి ఇంటికి రమ్మని మళ్ళీ జాబువచ్చింది. మంగ తనకోసం బెంగపెట్టుకున్నదట. వారివారి కోరికప్రకారం కొన్నవీ, సేకరించినవీ అడవిసరుకులు జాగ్రత్తపెట్టాడు వెంకటేశు. సాయంత్రం ఆ ఏటికి ఆఖరుసారిగా బీడు చూసి రావడానికి బయలుదేరాడు. తిరిగి నిన్నటి సాయంత్రం తాను కూర్చున్న చెరువు వారకేవచ్చి కొండనానుకొని కూర్చున్నాడు.

ఇన్నాళ్ళుగా తనతో మైత్రి నెరపుకున్న కొండకోనలూ, చెట్టుచేమలూ, పచ్చికబయళ్ళూ దీనంగా తనదెస చూస్తున్నట్లుంది. నిశ్చలంగా నిర్మలంగా ఆ చెరువు నిలబడిఉంది అతని కెదురుగా. ఆ చెరువులోనికి తానెప్పుడూ దిగలేదు. చెరువులో తామరపువ్వులూ లేవు. పోనీ అందులోవి మంచినీళ్లూ గాదు. తమ పశువులు మాత్రం అందులో నీళ్ళు తాగుతూండేవి. అయినా కొండవారకు వచ్చినప్పుడల్లా చూస్తూండడంచేత అదీ అతని ఊహాపథంలో ఒకస్థలంచేసుకుని ఇరుక్కుపోయింది. దాని విశిష్టతను నిన్నటిసంఘటన మరీ ఎక్కువ చేసింది. ప్రకృతిమాత అందాన్ని తిలకిస్తున్న వెంకటేశును ఎవరో పిలిచారు. చటుక్కున వెనుదిరిగి చూశాడు. క్షణంసేపు నిరుత్తరుడైనాడు. తన్ను పిలిచిన వ్యక్తి నిన్న సాయంత్రం పులి నేసిన మన్నెపడుచు. మరుక్షణంలో అతని ఊహ ఎన్నో వెనుకటిఘట్టాలను వెదక మొదలు పెట్టింది.

"నిన్నే—నిన్న ఆ పులి పరుగెత్తుకొచ్చిన బాట ఇదేనా" ఆమె ప్రశ్నించింది. వెంకటేశు మనసులో ఏంతట్టిందో! త్రుటిలో విషాదరేఖలను చిత్రించుకున్నాడు ముఖంలో. "ఔన"న్నట్లు తల ఊపాడు. ఆమె మరుక్షణంలో అతని ముందుకు వచ్చింది. నఖశిఖపర్యంతమూ తన చూపులతో అతన్ని గుచ్చి వేసింది. అతని విచారానికి కారణం వెదికే సానుభూతి ఆమె ముఖంలో తాండవించింది. "ఏం—అలా ఉన్నావ్?" అంటున్న ఆమెను ఎలాగైనా కూర్చుండబెట్టాలనిపించింది వెంకటేశుకు. అనేకవిధాలుగా వికారాలు విచిత్రంగా సుడి దిరిగాయి అతనిలో. కదలకుండా ఆమెరూపం కట్టేసింది. చక్కని సంధ్యారాగంలో చిక్కని తేనెను మైమరపించే ప్రకృతి రామణీయకత. కట్టెదుట కమనీయ సౌందర్య సౌరభం

వెదజల్లే పడుచు. ఎలాగ ఆమెను తనదగ్గరకు లాక్కోవాలా అనిపించింది. వెంకటేసు రెండు చేతులతోనూ తన ఎడమకాలిమడమ పట్టుకుని ముల్లు గ్రుచ్చుకున్నవానివలె అభినయం ప్రారంభించాడు. ఆమె దయాపూరితహృదయం వెంటనే అతనికి సాయపడ్డానికి ఆమెను పురికొల్పింది. త్రుటిలో భంగున కొలనివొడ్డుకు దూకి దోసెడు నీళ్ళు తెచ్చి అతని పాదం సాంతం కడిగింది. మెడలో పూసలపేరులో ఉన్న పిన్నీసుకోసం తడివింది. పిన్నీసు వెలికిదీస్తున్న ఆమె సోయగం చూస్తూ ముగ్ధుడౌతున్నాడు వెంకటేసు.

తన రెండు చేతులతోనూ అతని పాదం పొదివి పట్టుకుని ఎత్తి తన రెండు మోకాళ్లను ఒక్కటిగా జోడించి దానిపై మోపి పిన్నీసు మొనతో పాదం అంతా తడుముతూంది. నిజంగా ముల్లుంటేగా అవుపించడానికి? క్షణక్షణం తీయని అవ్యక్తమైనఆనందం వెంకటేసులో వేళ్ళు పాదుకుంటూంది. ఈ పిల్ల ఎంత అమాయకురాలు! పైకి కనపడని ఈ అందం నిజమైన ఆనందాన్నిస్తూందనిపించింది. నుదుట చెమటలు పట్టేదాకా వెదికింది. తడవడానికి పట్టు జారిపోతూంటే పాదాన్ని మరికాస్త దగ్గరగా హత్తుకోవడానికి ఆమె ప్రయత్నించడంలో అది అప్రయత్నంగా రెండుసార్లు ఆమె గుండెలకు తగిలింది. కాని ఆమె అసలు సంగతి గుర్తించినట్లు తోచదు. చివరకు ఆమె నిస్పృహతో నిట్టూర్చి ఆఖరుసారిగా తన సుతిమెత్తని చేతులతో గట్టిగా పాదమంతా నొక్కుతూ "నొప్పి ఎక్కడ ఎక్కువగా ఉంది?" అని అడిగింది. నిజంగా నొప్పి ఉంటేగా? "అబ్బా! ఎక్కడో లోపల గ్రుచ్చుకున్నట్టుంది ముల్లు" అని తన పాదం వెనుకకు లాక్కొని అదోక మాదిరిగా ఆమెవైపు చూశాడు వెంకటేసు. ఎంత అర్థం కానట్లున్నా ఆమెకు ఏదో బోధపడినట్లు అనిపించిందతనికి. "ఉండు. రెండు మంచినీళ్లు త్రాగివస్తాను" అంటూ లేచింది ఆమె ఆయాసంతో. అప్రయత్నంగా అతని చేయి ఆమె మణికట్టును పట్టుకుని ఆపు చేసింది. ఆ కరస్పర్శలో అతడు ఆమెలోకి ఒకవిధమైన విద్యుత్తును ప్రవేశింపచేయడానికి ఉద్యుక్తుడైనట్లు పసికట్టింది ఆ పడుచు. ఇందాకటినుండి అతడు పొందే ఆవేదనను గుర్తించింది; చేసిన మోసంగూడా తెలిసింది. అయితే ఆమె ఏమీ అనలేదు. "ఉండు ఇప్పుడే వచ్చేస్తా—దాహమౌతుంది" అని లేవబోయింది. ఇంకా అతడు ఆమె చేయి వదల్లేదు. ఆమెవైపు వికారంగా చూసి "నాకు అంతులేని దాహంగా ఉంది. నా దప్పిక తీర్చవూ?" అని ప్రాధేయపడ్డాడు. "అయితే—నీకు నీళ్ళు తీసుకొస్తా" అని ఆమె బలవంతంగా తన చేతిని విదలించుకొని కొండప్రక్కకు వెళ్ళిపోయింది.

మళ్ళిపోయిన ఆ పడుచు మనస్సులో ఏవో ఊహలు కదలిపోతున్నాయి—"ఛీ! మానవుడెంతటి నీచత్వానికి దిగజారిపోయాడు? ఎదుటివారి ఉదారతను గుర్తించి దోపిడికి దిగుతున్నాడు. నాడుగాని నాడు వచ్చాడుగదా అని తాను వానికష్టం నివారింపుదా మనుకుంది. అతడు తన సర్వస్వమూ కబళింప బూనుకున్నాడు. కొద్ది క్షణాల క్రిందట తాను చేసినపని తన్నే పరిహాసిస్తోంది. అకారణంగా జాలిగొని అతనికి సేవచేయబోతే ఎడమకాలితో తన హృదయాన్ని తన్నివేసిన మూర్ఖుడు." అప్రయత్నంగా కనుకొలకుల వెంబడి రెండు వేడి కన్నీటి బిందువులు దొర్లిపోయాయి. ఇంక ఎన్నడు అంతరం తెలీకుండా అన్యులకు సాయం చెయ్యగూడదనుకుంది. మరుక్షణం ఆమెలో ఇంకోభావం మెదిలింది. ఎలాగైనా వీడికి గుణపాఠం నేర్పాలనుకుంది.

అరగంట సేపయాక నిడుపాటి టేకుఆకుల దొన్నెలో నింపిన నీళ్లతో ఆమె ప్రత్యక్షమైంది వెంకటేసుముందు. ఏవేవో పిచ్చిపిచ్చి ఆలోచనలతో గాలిమేడలు కడుతున్న అతడు ఆమెను చూడగానే తటాలున ప్రపంచంలో పడ్డాడు. ఆమె ముఖంవైపు చూశాడు. వదనం సునిశితంగా ఉంది. త్రుటిలో పసికట్టేశాడు. ఆమె తనభావం ఎలా గుర్తించింది? కొంపదీసి ఇతరుల ఊహలు కనుగొనే మంత్రశక్తి ఆమెలో లేదుగదా! ఒకవేళ తన కోరిక గుర్తించి ఆమె అలాగున మారిందా? "మంచినీళ్ళివిగో" అన్న ఆమె గొంతులో చిరుచేదు ధ్వనించడం జాగ్రత్తగా విన్నాడు. ఆమె అతనికి చేరువగానే కూర్చుంది. అతడు రెండుచేతులతోనూ నీటి దొన్నె నెత్తుకుని ఆమె ముఖంవంక తదేకదీక్షగా చూస్తూ ఒక్క చుక్కైనా మిగల్చకుండా త్రాగేసి "అబ్బా! నీళ్లెంత తియ్యగా ఉన్నాయి! ఈ తీపి ఎక్కడనుంచి వచ్చిందో! ఆమె హృదయంలోంచా? చల్లని చూపుల్లోంచా? సుతిమెత్తని చేతుల్లోంచా? అంతకు కొద్ది క్షణాల క్రిందట తన పాదంతో స్పృశించిన ఆమె మెత్తని గుండెలలో తనకు స్థానం ఉందా—నిజంగానే!!" అనుకున్నాడు. ఆమె సంభాషణకుపక్రమించింది.

